విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సభ్యులు

హస్తినాపురం: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320–ఎ ఫ్రస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ జి.మహేంద్రకుమార్ రెడ్డి అన్నారు. హస్తినాపురంలోని భవిష్య ఇంటర్నేషనల్ స్కూల్లో చైర్మన్ టీ. శ్రీనివాస్‌రెడ్డి సహకారంతో లయన్స్ సంస్థ జిల్లా క్వెస్ట్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ వి.మాధవరావు నేతృత్వంలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్ది వారిని స్వశక్తితో ఎదిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మొదటిరోజు 26 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి వారి ద్వారా 6,7,8 తరగతుల విద్యార్థులకు విద్యాబోధన చేయడం జరుగుతుందని ట్రైనర్ లయన్ రేణుక కొండపల్లి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో లయన్ కందాళ గోవింద్‌రాజ్, లయన్ ముప్పారపు శ్రీనివాస్, లయన్ వేణు, మైఖేల్ తదితరులు పాల్గొన్నారు.

కొలనుల వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తాం



నిమజ్జన కొలనును పరిశీలిస్తున్న ఏసీపీ కాశిరెడ్డి, నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: వినాయక నిమజ్జనానికి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పిస్తామని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. పెద్దచెరువులోని నిమజ్జన కొలనును బుధవారం ఆయన వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పెద్ద చెరువుకు వచ్చేందుకు రోడ్డు వెడల్పుతో పాటు మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నట్లు వెల్లడించారు. కొలను వద్ద విద్యుత్‌దీపాలు, రెండు భారీ క్రేన్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వారి వెంట ఇంజినీరింగ్ డీఈ దామోదర్, వనస్థలిపురం సీఐ అశోక్‌రెడ్డి, టౌన్‌ప్లానింగ్ అధికారి మన్సూర్, ఎస్ఐ ప్రభాకర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సీతారామ్, శానిటేషన్ సూపర్‌వైజర్లు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసరావు, మహేందర్ పాల్గొన్నారు.

'రాజకీయ లబ్ధికోసమే ఎస్సీ వర్గీకరణ'



మోదీ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న సభ్యులు

చంపాపేట: రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అంశాన్ని తెరపైకి తీసుకొచ్చిందని రాష్ట్ర ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ సర్వయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత్‌బంద్‌లో భాగంగా బుధవారం మాల సంక్షేమ సంఘం నాయకులు మద్దెల నరేష్ ఆధ్వర్యంలో చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ చౌరస్తాలో నిర్వహించిన రాస్తారోకోలో ఆయన హాజరై ప్రధాని మోదీ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ పేరుతో బీజేపీ పాలకులు ఎస్సీ కులాల మధ్య చిచ్చుపెట్టి రాక్షసానందం పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణను వెనుకకు తీసుకోకపోతే ఆందోళన మరింత ఉధృతం చేసి ప్రభుత్వ కార్యకలాపాలను స్తంభింపజేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం సభ్యులు శ్రీధర్, రాజు, జంగయ్య, పరమేష్, మహేందర్, సమితి సభ్యులు సత్యనారాయణ, బల్వంతరావు, శివశంకర్, నాగభూషణం పాల్గొన్నారు.

ముందస్తు అరెస్ట్..

మలక్‌పేట: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం తలపెట్టిన భారత్‌బంద్ నేపథ్యంలో మాల సంఘా నేతలను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. మలక్‌పేట మాల సంఘం అధ్యక్షుడు ముప్పిడి బల్వంత్‌ను సంజీవయ్యనగర్‌లోని నివాసంలో తెల్లవారుజామున మలక్‌పేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సొంత పూచికత్తుపై విడుదల చేశారు.

భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణం వేగవంతం



మన్సూరాబాద్: సిమెంట్ రంగంలో తిరుగులేని సంస్థగా భారతి సిమెంట్ ఎదిగిందని, భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌తో నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయని సంస్థ టెక్నికల్ ఇంజనీర్ భద్రీ అన్నారు. హయత్‌నగర్ పరిధి లెక్చరర్స్‌కాలనీ కమాన్ వద్ద వేంకటేశ్వర స్టీల్ ట్రేడర్స్‌లో తాపీ మేస్త్రీలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భారతి సిమెంట్ స్లాబ్‌లు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారుల నిర్మాణానికి ఎంపికైందన్నారు. సిమెంట్ వినియోగం, సాంకేతిక అంశాలపై సంస్థ నిపుణులైన ఇంజనీర్లు సైట్ వద్దకు వచ్చి సహాయ పడుతారన్నారు. డీలర్ మధుసూదరెడ్డి మాట్లాడుతూ.. భారతి సిమెంట్ సేవలు సంతృప్తికరంతో పాటు వేగంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ మార్కెటింగ్ డిప్యూటీ మేనేజర్ రామకృష్ణ, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడి కేసులో నిందితుడికి జీవితఖైదు

రంగారెడ్డి కోర్టులు: మైనర్ బాలికపై లెంగికదాడి చేసిన కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ. 20 వేలు జరిమానా విధించారు. పీపీ సునితాబర్ల వివరాల ప్రకారం.. వనస్థలిపురం ఠాణా పరిధిలో నివసించే మైనర్ బాలిక ఇంట్లో నిందితుడు షఫీ పేయింగ్ గెస్ట్‌గా చేరాడు. బాలికపై కన్నేసిన నిందితుడు, ఇంట్లో ఎవరూ లేని సమయంలో అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాలిక తన తల్లికి విషయం చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితుడి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షాధారాలను విచారించిన రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి యం.కె.పద్మావతి మంగళవారం షఫీకి శిక్ష విధిస్తూ బాలికకు రూ. 7 లక్షల నష్టపరిహారం చెల్లించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థకు సిఫార్సు చేస్తూ తీర్పు వెలువరించారు.

వేగవంతంగా అభివృద్ధి పనులు



పనులు ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధి 31వ డివిజన్‌లోని బాలాజీనగర్ కాలనీలో బుధవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడారు. అన్ని డివిజన్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర అభివృద్ధి పనులు వేగంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. గణేష్ నవరాత్రులు పురస్కరించుకుని రోడ్లపై ప్యాచ్ వర్కులు పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఏఈఈ బిక్కు నాయక్, కొండా శ్రవణ్‌కుమార్, శ్యామ్‌సుందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్యసమావేశం

మేయర్ పారిజాతరెడ్డి అధ్యక్షతన కార్పొరేషన్ హాల్లో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆర్వో వేణుగోపాల్‌రెడ్డి అంశాలను సభలో ప్రవేశపెట్టారు. సుమారు రూ.47.63 కోట్లతో, 15వ ఫైనాన్స్ నిధులు రూ.3.80 లక్షలు ప్రవేశపెట్టారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ జి.రఘుకుమార్, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులను చెరిపేస్తున్నారు!



నాగోలు చెరువు బఫర్‌జోన్‌లో చేపట్టిన నిర్మాణాలు

- ఎల్‌బీనగర్‌లో కనుమరుగవుతున్న చెరువులు, కుంటలు
- హైడ్రా కమిషనర్ చేతిలో ఆక్రమణలో ఉన్న చెరువుల జాబితా
- భూకబ్జాదారుల్లో వణుకు

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ పరిధిలో చెరువులను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన కబ్జాదారులకు హైడ్రాతో వణుకు పుడుతోంది. ఖాళీ స్థలాలపై కబ్జాదారుల కళ్లు పడడంతో వందల ఎకరాలు చెరువులు, ప్రభుత్వ భూములను ఆక్రమించి దర్జాగా ప్లాటుగా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అండ్ అసెట్ ప్రొటక్షన్ ఏజన్సీ(హైడ్రా) ఏర్పాటుతో ఆక్రమణలపై కొరడా ఝళిపిస్తున్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో సుమారుగా 10కి పైగా చెరువులు, కుంటలు ఉంటే ప్రస్తుతం సగానికి సగం కనుమరుగయ్యాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హైడ్రాతో భూబకాసురుల వెన్నులో వణుకు పుడుతుంది. నిత్యం ఏదో ఓ చోట కూల్చివేతలతో హడలెత్తిస్తున్నారు.

దాదాపుగా 10 చెరువుల్లో..

రాజులకాలం నాటి నుంచి చెరువుల పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకునేవారు. అప్పట్లో ప్రతి గ్రామంలో ప్రజల అవసరాల కోసం చెరువులను నిర్మించారు. ఆ చెరువులు రానురానూ ఆక్రమణకు గురై నీటి కష్టాలు వచ్చి ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలో సుమారుగా 10 చెరువులు ఉంటే దాదాపు అన్ని చెరువులు ఆక్రమణకు గురయ్యాయి. కర్మన్‌ఘాట్ రెవెన్యూ పరిధిలో ఉన్న చేపల చెరువు ఆనవాలు లేకుండా చేసి నిర్మాణాలు చేపట్టారు. చెరువుల ఆక్రమణకు గురవుతున్నా విషయంపై ఇటీవల హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటించి వివరాలను సేకరించారు. పూర్తిస్థాయి నివేదిక రాగానే ఆక్రమణలపై చర్యలు ఉంటాయని ఆయన పేర్కొనడంతో ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లుపరిగెడుతున్నాయి.

ఎల్‌బీనగర్‌లోని చెరువుల వివరాలు ఇలా..

బైరమల్‌గూడ చెరువు..

ఎల్‌బీనగర్‌లో బైరమల్‌గూడ చెరువు విస్తీర్ణం రెవెన్యూ రికార్డుల ప్రకారం 6.25 ఎకరాలు ఉంది. ఇందులో కొందరు భూకబ్జాదారులు సుమారుగా 3 ఎకరాల మేరకు ఆక్రమించేశారు. ఈ చెరువుకు సుమారుగా 2 ఎకరాల శిఖం భూమి కూడా ఉన్నట్లు రికార్డులలో స్పష్టంగా ఉంది. ఆక్రమించిన చెరువు స్థలంలో పార్కింగ్ చేసి వసూళ్ల దందాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నాగోలు చెరువు..

ఉప్పల్ మండలంలోని సర్వే నెంబర్ 89లో నాగోలు చెరువు 12 ఎకరాలు. ఇందులో సుమారుగా 5 ఎకరాల మేరకు ఆక్రమించి జోరుగా నిర్మాణాలు చేపట్టారు. ఇక మిగిలింది కేవలం 7 ఎకరాలే. మిగిలింది కూడా ఎప్పుడు ఆక్రమిస్తారో అని స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు.

బండ్లగూడ చెరువు..

ఉప్పల్ మండలంలోని నాగోలు వద్ద ఉన్న బండ్లగూడ చెరువు సర్వే నెంబర్ 44లో 36 ఎకరాల విస్తీర్ణంలో ఉండేది. ప్రస్తుతం 21 ఎకరాలు మాత్రమే ఉంది. అంటే 15 ఎకరాల మేరకు ఆక్రమణ చెరలో ఉంది. ఇందులో భూబకాసురులు ప్లాట్లుగా చేసి అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు.

మన్సూరాబాద్ పరిధిలో...

- పెద్ద చెరువు సర్వే నెంబర్47లో 28 ఎకరాల 6 గుంటలు ఉంటే ప్రస్తుతం 17 ఎకరాలు మాత్రమే మిగిలింది. సుమారుగా 11 ఎకరాల వరకు కబ్జాదారులు ఆక్రమించేశారు.
- చిన్న చెరువు విస్తీర్ణం 6.37 ఎకరాలు ఉండగా ప్రస్తుతం 2 ఎకరాలు మాత్రమే ఉంది. అంటే 4.37 ఎకరాల వరకు ఆక్రమణలో ఉంది.
- హత్తిగూడ చెరువు విస్తీర్ణం 6 ఎకరాలు, ప్రస్తుతం 2 ఎకరాలు మాత్రమే మిగిలింది.
- హస్తినాపురంలో ఉన్న చేపల చెరువు సర్వే నెంబర్ 58లో 14 ఎకరాల విస్తీర్ణంలో ఉండేది. ప్రస్తుతం చెరువు అనవాళ్లు లేకుండా పూర్తిగా ఆక్రమి ంచి బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టారు. ఈ చెరువుకు సంబంధించిన రెవెన్యూ రికా ర్డులను సైతం మాయం చేసినట్లు సమాచారం.

బీఎన్‌రెడ్డినగర్‌లో ..

కప్రాయి చెరువు మొత్తం విస్తీర్ణం 57 ఎకరాలు. గతంలోనే ఈ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి వరకు హద్దులను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 13 ఎకరాలు వరకు ఉంటుంది.

- బతుకమ్మ కుంట రెవెన్యూ రికార్డుల ప్రకారం 12 ఎకరాలు ఉండేది. ప్రస్తుతం 5 ఎకరాలు మాత్రమే మిగిలింది. మిగితా భూ భాగం ఆక్రమణలో ఉంది. అన్ని పెద్ద పెద్ద కట్టడాలు వెలిశాయి.

హయత్‌నగర్‌లో..

కుమ్మరికుంట చెరువు విస్తీర్ణం 30 ఎకరాలు ఇందులో ఎఫ్‌టీఎల్ పరిధి 9.3 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ పరిధిలో నిర్మాణాలు చేపట్టారు. బాతుల చెరువు విస్తీర్ణం 70 ఎకరాలు ఉంది. 29.9 ఎకరాల విస్తీర్ణంలో వివిధ రకాల నిర్మాణాలు చేపట్టారు.

ఫత్తులాగూడ చెరువు..

ఫత్తులాగూడ చెరువు నాగోలు పరిధిలో ఉంది. సర్వే నెంబర్ 36. ఈ చెరువు విస్తీర్ణం గతంలో 14 ఎకరాలు ఉంది. ప్రస్తుతం ఆక్రమణలు కాగా మిగిలింది కేవలం 7 ఎకరాలు మాత్రమే.

ఆక్రమణకు గురికాగా మిగిలిన బైరమల్‌గూడ చెరువు



"చేపల చెరువు ఎక్కడ?



కర్మన్‌ఘాట్ రెవెన్యూ పరిధిలోని హస్తినాపురం డివిజన్ పరిధిలో సర్వే నెంబర్ 58లో 14 ఎకరాల విస్తీర్ణంలో ఉండేది.ఈ చెరువును భూకబ్జాదారులు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు.ఈ ఆక్రమణలతోనే రెడ్డికాలనీ, సాగర్‌ఎన్‌క్లేవ్‌కాలనీలు వర్షం వచ్చినప్పుడల్లా ముంపునకు గురవుతున్నాయి. చేపల చెరువులో నిర్మించిన అక్రమ నిర్మాణాలు కూల్చి వరద ముంపు నుంచి వివిధ కాలనీలను కాపాడాలి.

–శశిధర్‌రెడ్డి, హస్తినాపురం

"అధికారులు స్పందించడం లేదు..



చెరువుల ఆక్రమణలపై అనేక సార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇరిగేషన్ అధికారులు ఎక్కడ ఉంటారో తెలియదు. రెవెన్యూ అధికారులు కబ్జాల గురించి పట్టించుకోవడంలేదు. కబ్జాదారులతో కుమ్మక్కై, చెరువులు ఆక్రమణలతో కుంచించుకుపోయి తరుచూ వరదతో పాటు ముంపు సమస్య తలెత్తుతోంది.

–యాదగిరియాదవ్, హయత్‌నగర్

నియామకం



అనిల్‌కుమార్

చంపాపేట: బీజేవైఎం రాష్ట్ర యువమోర్చా కార్యవర్గ సభ్యుడిగా చంపాపేట డివిజన్ కటకోనికుంట కాలనీకి చెందిన సిలివేరు అనిల్‌కుమార్ నియమితులయ్యారు. అనిల్ మాటాడుతూ.. బాధ్యతాయుతమైన పదవిలో తనను నియమించేందుకు సహకరించిన నాయకులు మహేందర్, సామరంగారెడ్డి, శేఖర్‌జీ, మధుసూదన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

నాగోలు: నిత్యం యోగా చేస్తే ఆరోగ్యంగా ఉంటారని నాగోలులోని గీతాంజలి ది స్కూల్ ప్రిన్సిపాల్ నందిని అన్నారు. ఇటీవల నగరంలో నిర్వహించిన యోగా ప్రదర్శనలో పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొని వివిధ యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే యోగాను అలవాటు చేసుకోవాలన్నారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు..

టమాట రూ. 15, వంకాయ రూ. 28, బెండ రూ. 23, పచ్చిమిర్చి రూ.18–40, కాకర రూ. 23, బీర రూ. 18, క్యాబేజీ రూ. 19, ఫ్రెంచి బీన్స్ రూ. 45, క్యారెట్ రూ. 40, దొండ రూ. 23–24, చిక్కుడు రూ. 45, గోకర రూ. 28, బీట్‌రూట్ రూ. 28, సొర రూ. 11, పొట్ల రూ. 13, ఉల్లిగడ్డ రూ. 44, చామగడ్డ రూ. 23.

ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

డ్యూటీకి వెళ్లిన యువకుడి అదృశ్యం



అశోక్‌కుమార్

నాగోలు: డ్యూటీకి వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నాగోలు సాయినగర్ కాలనీహట్స్‌లో నివాసం ఉండే నెనావత్ అశోక్‌కుమార్(26) మల్లాపూర్ స్టాక్ యార్డ్ కార్స్ గోడాన్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 20న రోజులాగే డ్యూటీకి వెళ్లిన అశోక్‌కుమార్ రాత్రైనా ఇంటికి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఫోన్‌చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. అతడు పనిచేస్తున్న కార్యాలయానికి ఫోన్ చేయగా డ్యూటీకి రాలేదని చెప్పడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. యాదగిరినగర్‌లో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కాలనీల్లో అభివృద్ధి పనులు జరిగేటప్పుడు కొంత మేర అసౌకర్యాలు, ఇబ్బందులు ఏర్పడుతాయని కాలనీవాసులు సంయమనం పాటించి అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్పొరేటర్ వెంట సర్కిల్ అధికారులు రఫీ, రాజు, వాటర్‌వర్క్స్ మేనేజర్ రమ్యభారతి, కాలనీవాసులు కృష్ణారెడ్డి, బక్కప్ప, రమేష్, కిషన్, నాయకులు సందీప్‌రెడ్డి, శ్రీనివాస్‌నాయుడు, సుమిత్, శ్రీధర్‌గౌడ్ ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా సకాలంలో అభివృద్ధి పూర్తి చేయాలని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలో శాలివాహననగర్ అజయ్ హట్స్ నుంచి వాంబే కాలనీ వరకు నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. అంతర్గత రోడ్లను అందంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటామన్నారు.రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. పనుల్లో నాణ్యత పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, బస్తీ నాయకులు సరస్వతి, సందీప్, నవీన్, రాములు, దినేష్, నాగరాజు, ఉమేష్ పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ రైతు ధర్నా

మహేశ్వరం: మండల కేంద్రంలో బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్ చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 గంటలకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణ మాఫీ పేరుతో మోసం చేసిందని ఆరోపిస్తూ రైతు మహాధర్నా నిర్వహించనున్నారు. ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి హాజరవుతారని పార్టీ నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైద్యుల నిర్లక్ష్యంతో చిన్నారి మృతి

- కుటుంబ సభ్యుల ఆరోపణ
- పారమిత హాస్పిటల్ ఎదుట ధర్నా



పారమిత హాస్పిటల్‌లో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

దిల్‌సుఖ్‌నగర్: అత్యవసర స్థితిలో ఆస్పత్రికి తీసుకొస్తే చికిత్స అందించకుండా అడ్మిషన్ తీసుకోవాలని అరగంట ఆలస్యం చేయడంతో తమ చిన్నారి మృతి చెందిందని కొత్తపేట పారమిత హాస్పిటల్ ముందు కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. నల్గొండ పాన్‌గల్‌కు చెందిన అధిర (5) అనే చిన్నారికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉందని నల్గొండ టౌన్‌లో ఓ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని సూచించడంతో కుటుంబ సభ్యులు అధిరను కొత్తపేటలో పారమిత్ర చిల్డ్రన్ హాస్పిటల్‌కు మంగళవారం రాత్రి 12 గంటలకు తీసుకొచ్చారు. సుమారు 45 నిమిషాల వరకు చికిత్స చేయకుండా అడ్మిషన్, డబ్బులు కట్టించుకోవడానికి ఆలస్యం చేశారు. డబ్బులు కట్టిన అనంతరం ఐసీయూలో పెట్టి జూనియర్ డాక్టర్‌తో వైద్యం చేసినట్లు నటించారని బాలిక తండ్రి అజయ్‌కుమార్ ఆరోపించారు. తన కూతురుకు ఎలాంటి వైద్యం అందించకుండా డబ్బులు కట్టించుకున్నారని ఆరోపించారు. వైద్యం చేయడంలో ఆలస్యం చేయడంతో తమ చిన్నారి మృతి చెందిందంటూ ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు హాస్పిటల్ ఎదుట ఆందోళనకు దిగారు. పారమిత్ర హాస్పిటల్‌పై చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా డిప్యూటీ డీఎంహెచ్ఓ గీత ఫిర్యాదు చేయగా ఆమె వైద్య అధికారి వెంకటరమణ, సరూర్‌నగర్ పీహెచ్‌సీ డాక్టర్ అర్చనతో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. పూర్తి విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు చిన్నారి కుటుంబ సభ్యులను అక్కడి నుంచి పంపించారు.



అధిర(ఫైల్)